# మా ఊరు ఒక్కసారి పోయి రావాలి

"మనిషి పాతరాతి యుగం నుంచి పరమాణు యుగం వరకు ఎదిగి ఎన్నో అద్భుతాలు సృష్టించినా ఇంత వరకూ మనిషి పూర్తిగా చిక్కు విప్పలేనిది మనసు. అది సృష్టించే స్థితి. మనిషి మానసిక స్థితి నీటిలో తేలే మంచు ముక్కతో పోలిస్తే నీటిలో తేలే మంచుముక్క అందరికీ కనిపించే వ్యక్తిత్వమైతే, నీటి అడుగున ఎవరికీ కనిపించనిది మనిషి అసలు రూపం అన్నారు సిగ్మండ్ ఫ్రాయిడ్."

చెప్పడం ఆపి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు ఆదిత్య.

ఆ ఎయిర్ కండిషన్డ్ సెమినార్ హాల్‌లో మూడొందలకు పైగా డెలిగేట్ల మధ్య ఆ ముప్పయేళ్ళ యువకుడు అలవోకగా ఉపన్యాసం ఇస్తున్నాడు. ఐతే ఒక్క క్షణం చెమటలు పట్టడానికి కారణం ఆ ఆవరణలోకి హఠాత్తుగా ప్రవేశించిన ఆ అరవయ్యేళ్ళ వృద్ధురాలు. ఆవిడ బాగా అలసిపోయినట్టు కనిపిస్తోంది. మాసిపోయిన చీర, బాగా రేగిన జుట్టు. అతడి వంక తదేకంగా చూస్తోంది. ఆ చూపుల్లో ఏ భావమూ లేదు.

ఆదిత్యకు గొంతు తడారిపోయింది. అతడి పక్కనే ఉన్న పాలరాతి శిల్పం లాంటి అమ్మాయి వైపు చూశాడు. ఆమె అంత సేపు ఆదిత్య ఇస్తున్న ఆ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు సహకరిస్తోంది.

"ఏం చెయ్యమంటారు?" అన్నట్లు చూసిందామె.

"ఆవిడ ఇక్కడికెలా వచ్చింది? ఎవరు తీసుకొచ్చారు? రూములో కూర్చోబెట్టు. తాగడానికి ఏమైనా ఏర్పాటు చెయ్యి" అన్నాడతను ఆ అమ్మాయితో మెల్లగా. ఆమె అక్కడినుంచి కదిలింది. ఆ ముసలావిడను మెల్లగా నడిపించుకుంటూ ఆ ఆవరణ దాటింది. అతను మళ్ళీ తన ఉపన్యాసం కొనసాగించాడు.

“మతి భ్రమించడం అంటాం. అంటే మనసు దారి తప్పడం. అది మరీ తీవ్రతరంగా పరిణామం చెందితే వచ్చే జబ్బు అల్జీమర్స్. ఇది వృద్ధాప్యంలో ఎదురయ్యే సమస్య. రక్త సంబంధీకుల్ని మరిచిపోయే స్థితి. ఈ జబ్బు జర్మనీ వైద్యవేత్త డాక్టర్ ఆలోయిస్ అల్జీమర్స్ పేరిట ప్రాచుర్యం పొందింది. నేను పరిశోధనరీత్యా ఈ వ్యాధి నివారణకు మందుల కన్నా వ్యాధి గ్రస్తుల్ని వారి పూర్వస్థితిలోని విషయాలు, జ్ఞాపకాల్లోకి తీసుకెళ్లడం ద్వారా వారిని మామూలు స్థితిలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను” అంటూ అతను అలా గంట సేపు ఏకధాటిగా ప్రసంగించిన తర్వాత సభ అంతా చప్పట్లతో మారుమ్రోగింది.

అంతలో ప్రేక్షకుల్లోంచి ఒకాయన లేచి నిలబడ్డాడు. సూటు ధరించిన ఆ వ్యక్తి వయసు అరవైయేళ్ళ పైనే. అందరి వంక నవ్వుతూ చూసి

“డాక్టర్ ఆదిత్య, గురించి రెండు మాటలు పంచుకోవాలనుంది. ఆయన మన తెలుగు దేశంలో పుట్టి, మెల్‌బోర్న్‌లో మానసిక వైద్య రంగంలో విజయకేతనం ఎగురేస్తున్నాడు. ఇంత చిన్న వయస్సులోనే అంతర్జాతీయంగా ఎదిగినందుకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో నా శిష్యుడు అయినందుకు నాకు చాలా గర్వంగా ఉంది” అంటూ చెప్పడం ముగించాడు. సభలో మళ్ళీ కరతాళ ధ్వనులు.

అయితే ఆదిత్యకు ఆ చప్పట్లు వినిపించడం లేదు. ఆ సందడిలో అతడి మనస్సు మాత్రం వచ్చిన ముసలావిడ చుట్టే తిరుగుతోంది.

ముసలావిడను వెంట పెట్టుకుని వెళ్ళిన యువతి హాల్లోకి ప్రవేశించి ఆదిత్యను సమీపించింది. ఆ యువతి ఆయాసపడుతూ వచ్చింది. ఆదిత్య ప్రశ్నార్థకంగా చూసాడు.

“ఆవిడ నన్ను తోసుకుని గబగబా పరుగెత్తింది బైటకు. మెట్ల మీద నుంచే క్రిందకు దిగి హోటల్ దాటింది. ఆవిడను తీసుకొచ్చిన అబ్బాయితో ఆటో రిక్షా ఎక్కింది” అంది.

ఆమె మాటలు ముగిసాయో లేదో, అతను వేగంగా డయాస్ దిగాడు. ఆ హాల్‌లోంచి బైటకొచ్చి లిఫ్ట్ ఎక్కి క్రిందకు దిగాడు. అతను అలా పరుగెడుతుంటే అర్థం కానట్టు చూస్తూ ఉండిపోయారు ఆ డయాస్ మీద ప్రముఖులు. ఆ అమ్మాయిని అడిగారు 'ఇంతకీ ఆ ముసలావిడెవరు?' అని. "ఆవిడ డాక్టర్ ఆదిత్యగారి తల్లి..." అంది మరి మీరు? అన్నాడొకాయన. ఆ మాటలకు తలొంచుకుంది ఆమె.

కోటు మీద డాక్టర్ ఫణికర్ అనే నేమ్‌ప్లేటున్న పొడుగ్గా ఉన్న ఒక యాభయ్యేళ్ళ వ్యక్తి వెంటనే "నేను మెల్‌బోర్న్ హెల్త్ యూనివర్సిటీలో న్యూరాలజీ హెడ్‌ని. ఈ అమ్మాయి నా కూతురు మైథిలి, డాక్టర్ ఆదిత్య నాకు కాబోయే అల్లుడు" అన్నాడు. అలా అంటూ అతను ఆ డయాస్ దాటి ఆ హాల్ నుంచి బైటకు కదిలాడు. ఆయన కూతురూ అతడిని అనుసరించింది. ఇద్దరు హొటల్ నుంచి బైట రోడ్డు మీదకు వచ్చారు. తమ ముగ్గురిని తీసుకొచ్చిన కారు బైట ఉంది. వాళ్ళను చూసి కారు డ్రైవరు పరుగెత్తుకుంటూ వచ్చాడు. "నేను టీ తాగడానికి వెళ్ళాను సార్. నేను వచ్చేలోపే ఆటో ఎక్కేసారు..." అన్నాడు.

"డాడీ! ఆయన ఇల్లు మనకు తెలీదు కదా?" అందా అమ్మాయి అయోమయంగా.

"నాకు తెలుసమ్మా!

ఆరు నెలల క్రితం వచ్చాను" అన్నాడు తండ్రి. ఆమె అతడి వంక ఆశ్చర్యంగా చూసింది.

ఇద్దరూ కారెక్కారు. "హైవే మీదుగా పోనియ్. ఆ తరువాత పెట్రోల్ బంక్ వైపుగా విశాలాక్షినగర్ గాంధీ బొమ్మ దగ్గర సందులో ఆపు" అన్నాడు తండ్రి.

కారు పది నిమిషాల్లో అక్కడకు చేరుకుంది. అప్పటికే ఆటోలోంచి దిగుతున్నాడు ఆదిత్య. ఆ రంగు వెలిసిన పాత డాబా ఇంటి ముందు ఆగాడు. చుట్టూ ఖాళీ స్థలం. పూల మొక్కల మధ్యలో ఇల్లు. తలుపు దబదబా బాదాడు. అవతల నుంచీ ఏ శబ్దమూ లేదు. అతడికి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. కోటు తీసేసాడు. టై ముడి విప్పాడు. కర్చీఫ్‌తో ముఖం తుడుచు కున్నాడు. అతడి ఫియాన్సీ మంచినీళ్ళ సీసా అందించింది. మళ్ళీ తలుపు కొట్టాడు... కంగారు... టెన్షన్,

చుట్టుపక్కల ఉంటున్న వారంతా మూగారు. ఒక మధ్య వయసులో ఉన్న వ్యక్తి వచ్చి "నమస్తే డాక్టరు గారూ బావున్నారా! రెండు రోజుల క్రితం మీరు ఈ ఊళ్ళో సెమినార్‌లో పాల్గొంటున్నారని పేపర్లో చూసి చెప్పా. అయోమయంగా చూసింది. ఆరు నెలల నుంచి అలాగే ఉంటోంది. నిన్నే చెప్పాను. మీ అబ్బాయి వస్తాడమ్మా.. అని 'అలాగా' అంటూ గబగబా వంట మొదలు పెట్టింది. ఇవాళ ఉదయం గుర్తు చేసాం. మరిచిపోయినట్టుయింది. నేనే మా అబ్బాయినిచ్చి ఆటో ఎక్కించాను. హొటల్‌కు పంపాను. వెంటనే వచ్చేసింది. రాగానే లోపల తలుపేసుకుని ఏడుస్తోంది" అన్నాడు. తన శక్తినంతా ఉపయోగించి తలుపు బాదాడు. బలహీనంగా ఉన్న గొళ్ళెం ఊడొచ్చింది.

లోపలి గదిలో తల్లి. రేగిన జుట్టు, ఏడ్చి ఉబ్బి పోయిన కళ్ళు. "అమ్మా" అన్నాడు దగ్గరగా వెళ్ళి. ఆవిడలో ఏ మార్పూలేదు. రెప్ప వాల్చకుండా అలాగే చూస్తోంది. అతడి డాక్టరు బుర్రలో ఎన్నో అనుమానాలు, సందేహాలు.

"నేనేనమ్మా నీ ఆదిత్యను!" అన్నాడు. ఆవిడ రెండు చేతులూ పట్టుకుని. ఆమెలో ఏ మార్పూలేదు. కళ్ళు రెండూ రుద్దుకున్నాడు.

అతడి కాబోయే మామగారు ఇంటిని శల్య పరీక్ష చేసి చూస్తున్నాడు. తన కూతురి అత్తవారిల్లు అంత దీనంగా ఉన్నందుకు బాధపడుతున్నాడు. గోడలకు ఎన్ని రోజులయిందో సున్నాలు వేసి, పెచ్చులూడి పోయి వార్ధక్యపు

చర్మంలా ఉంది. గదిలో ఒక నవారు మంచం. పక్కనే చెక్క బీరువా, ఆ గది పక్కనే చిన్న వంట గది. మెల్లగా వంటగదిలోకి వెళ్ళాడు ఆదిత్య. లోపల వంట గదిలోని పాత్రల్లోనివి తల్లి నిన్న చేసిన వంటలు చూసి ఆశ్చర్య పోయాడు.

“చూసారా...నేను చిన్నప్పుడు ఇష్టపడే వంటలు ఏంటో ఆమెకు గుర్తున్నాయి. నాకిష్టమైన కోడిగుడ్డు కూర, గోంగూర పప్పు” అంటూ కళ్ళ నీళ్ళుపెట్టుకున్నాడు ఆదిత్య.

“రిలాక్స్ ఆదిత్యా! కంగారుపడకు. మీ అమ్మగారు కోరుకుంటారు.” అన్నాడు ఆయన అదిత్య భుజం తట్టి.

“అమ్మా మాట్లాడమ్మా కోపం వచ్చిందా? తప్పు చేసానా? సెమినార్‌కు డైరెక్టుగా వెళ్ళకుండా నీ దగ్గరకు రావలసింది. అక్కడికే వచ్చినా నిన్ను నేను పట్టించుకో లేదు. పాపం సంవత్సరం నుంచీ కొడుకు కోసం ఎంత బెంగ పడ్డావో?!” అన్నాడు దుఃఖపడుతు ఆదిత్య.

“నేను ఆరు నెలల క్రితం వచ్చినప్పుడు కొంచెం బాగానే ఉంది గానీ....అప్పటికే నాకు ఈ లక్షణాలు కనిపించాయి” అన్నాడాయన.

“ఆరు నెలల క్రితమా...నాకు చెప్పలేదే నుండి” అన్నాడు ఆదిత్య ఆశ్చర్యంగా.

“మీ గురించి ఎంక్వయిరీ చెయ్యడానికి వచ్చానని తెలిస్తే బాధపడ తారని చెప్పలేదు. కూతుర్ని ఇచ్చే ముందు మీ గురించి తెలుసుకోవాలి కదా! అందుకే వచ్చాను. అయితే మీరు అబద్ధం చెప్పారు” అన్నాడాయన.

ఆ మాటలకు ఆశ్చర్యపడుతూ “నేను అబద్ధం ఆడానా?” అన్నాడు.

“ఔను షేర్ మహమ్మద్‌పురం జమిందారు గారి అబ్బాయినని చెప్పారు. కానీ మీరు జమిందారుగారి తోటలో పనిచేసే తోటమాలి కొడుకు.

ఈ విషయం నేను ఇక్కడకు రాగానే తెలిసింది. మీరు అలా చెప్పకుండా ఉండాల్సింది. నా కూతురు మిమ్మల్ని ప్రేమించిన తర్వాత. మీ స్టేటస్ ఎలా ఉంటే నాకేల?'' అన్నాడాయన.

ఆ మాటలకు ఆదిత్య ముఖం పాలిపోయింది. వెంటనే తలొంచు కున్నాడు. క్షణం సేపు ఆలోచనలో పడి తన తల్లి కళ్ళల్లోకి సూటిగా చూశాడు. ఆమెలో ఏ మార్పూలేదు. తను తెచ్చిన సూట్‌కేసు తెరిచి దాని లోంచి ఒక మందుల పెట్టె తీసి, ఇంజక్షన్ లోడ్ చేసి ఆమె శరీరంలోకి గుచ్చాడు. ఆమె ఏ మాత్రమూ ప్రతిఘటించలేదు. మెల్లగా ఆమెను మంచం మీద పడుకోబెట్టాడు. పక్క సర్దాడు. తలగడ తల క్రింద ఉంటాడు. అతడి ఫియాన్సీ అతనికి సహాయం చేసింది.

అంత క్రితం జరిగిన సంభాషణ ఇబ్బందికరంగా ఉండడంతో ఏం మాట్లాడాలో తెలీక మౌనంగా ఉండి పోయాడు ఆదిత్య.

‘‘హోటల్‌కు వెళదాం బాబూ...సెడెషన్ ఇచ్చారు కదా పడు కుంటుంది ‘‘అన్నాడు. కాబోయే మామగారు.

‘‘మీరు వెళ్ళండి. బాగా అలసిపోయారు కదా'' అన్నాడు ఆదిత్య.

‘‘మరి మీరూ అలసిపోయారు కదా!'' అన్నాడాయన.

‘‘లేదు నేను అమ్మ దగ్గరే ఉంటాను.'' అన్నాడు ఆదిత్య.

‘‘అత్తయ్యగారికి ఏమయి ఉంటుంది?'' అంది మైథిలి.

‘‘అల్జీమర్స్'' అన్నాడు.

‘‘మైగాడ్'' అంది మైథిలి అప్రయత్నంగా. గంట క్రితమే అతడు ఉపన్యాసం ఇచ్చింది ఆ విషయం మీదే కావడంతో ఆమెకు మరింత ఆశ్చర్యం కలిగింది.

“నేను ఆరునెలల క్రితమే ఈ లక్షణాలను గమనించాను. ఇప్పుడు మనం చెయ్యగలిగింది ఏముంది? నర్సింగ్‌హోమ్‌లో జాయిన్ చేసి మీ బంధువులకు అప్పజెప్పు బాబూ. మనం ఇంకో రెండు గంటల్లో ట్రెయిన్ అందుకోవాలి!” అన్నాడాయన టైము చూసుకుంటూ.

ఆదిత్య వెంటనే తలెత్తి ఆయన కళ్ళల్లోకి సూటిగా చూసి “మీరు వెళ్ళండి నేను తర్వాత వస్తాను” అన్నాడు.

“నేనూ ఉండిపోతాను” అంది మైథిలి.

“లేదు నువ్వు వెళ్ళు” అన్నాడు ఆదిత్య మందహాసంతో.

ఆమె తన తండ్రితో కలసి ముందుకు నడిచింది. మళ్ళీ వెనక్కి తిరిగింది. అతడిని చూస్తూనే కదిలింది.

ఆదిత్య తన తల్లి మంచం ఎదురుగా ఉన్న స్టూలు లాక్కుని కూర్చు న్నాడు. తల్లి మెల్లగా నిద్రలోకి జారుకుంది.

అతడిలో పాత, జ్ఞాపకాలు. పదేళ్ళ పిల్లవాడయిపోయాడు. తల్లి అతడి ముందు నడుస్తోంది. ‘ఇడ్లీలు... ఇడ్లీలు’ అంటూ ఆరుస్తోంది. ఆదిత్య ఆమె వెనక నడుస్తూ అల్యూమినియం కేరేజీ మోస్తున్నాడు. తరువాత దృశ్యం మారింది. ఆదిత్య స్టేజీ మీద నుంచున్నాడు. దుర్యోధనుడి ఏకపాత్రాభినయం. పందకొండేళ్ళ వయసులో పద్యాలతో, డైలాగులతో అదరగడుతున్నాడు.

వెనక ఎవరికీ కనపడకుండా తెర వెనుక ప్రాంప్టింగ్ చేస్తున్న తల్లి.

మరి కొన్నేళ్ళ తర్వాత ఇంకో దృశ్యం. ఇంటర్మీడియట్‌లో తొంబైశాతం మార్కులు. ఎంట్రన్స్‌లో ర్యాంకు. ఎమ్‌బీబియస్‌లో సీటు వచ్చిన రోజు. ఆ రోజు తల్లి తల స్నానం చేయించింది. కొత్త బట్టలు తొడిగింది. పాయసం తినిపిస్తూ ‘నాన్నా! నాకెందుకు తల్లిదండ్రులు ఆశ అని అనే పేరు పెట్టారో గాని, ఎప్పుడూ ఆశల్లోనే బతికేదాన్ని నన్ను ప్రేమగా చూసుకునే భర్త

కావాలనుకున్నాను. అలాగే దొరికాడు. ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు. జమీందారు గారింట్లో మా నాన్నది గుమస్తా ఉద్యోగం. నాన్నతో జమిందారు గారి ఎస్టేటుకి వెళ్ళేదాన్ని. అలా జమిందారుగారి తోటల్ని చూసే తోటమాలితో ప్రేమలో పడ్డాను. పువ్వుల్ని ప్రేమించే అతను నన్ను పువ్వు లాగా చూసు కున్నాడు. అయితే ఆ ఆనందం నాకు పూర్తిగా అందకుండానే పువ్వులా రాలిపోయాడు. ఆ జమిందారుగారి కొడుకులా నా కొడుకు బాగా చదువు కోవాలనుకున్నాను. అలా నా ఆశ నెరవేర్చావు. నా కొడుకు నన్ను ప్రేమగా చూసుకుంటాడన్న ఆశ ఉంది. ఆ ఆశ...నువ్వు నెరవేరుస్తావన్న నమ్మకం ఉంది' అని అన్నది ఆ రోజు అమ్మ. ఆమె ఆశను వమ్ము చేసానా? ఆదిత్య ఆలోచనలో పడ్డాడు.

'ఎమ్‌బీబియస్ మంచి మార్కులతో పాసయి ఎండి చేసాను. మెల్‌బోర్న్‌లో ఫెలోషిప్. అక్కడ డాక్టర్ ఫణికర్ కూతురితో ప్రేమలో పడ్డాను ఆరు నెలల క్రితం మామగారొచ్చి ఎంక్వయిరీ చేశారు. ఆయన చెప్పింది నిజమే. తను ఫాల్స్ ప్రెస్టేజీకి వెళ్ళి అబద్ధం చెప్పాను. తన తల్లి వేళ్ళు మరిచిపోయాడు' ఆదిత్యలో మూగరోదన!

రోజూ తల్లి ఉదయం, మధ్యాహ్నం, రాత్రి టెలిఫోన్ బూత్ దగ్గరే తచ్చాడేదట. ఎవరింట్లో ఫోన్ మోగినా మా అబ్బాయి నుంచే 'అనేదట! చెప్పాడొకసారి పక్కింటి సంగీతం మాస్టారు. తల్లి తన కోసం అంత ఆరాట పడినా తనేం చేశాడు? అమెరికా చదువులో పడి పూర్తిగా కూరుకుపోయాడు. తల్లిని పట్టించుకోలేదు. మధ్యలో ప్రేమలో పడ్డాడు. ఎంతో కష్టపడి పెంచిన తల్లిని మరిచిపోయాడు. సంగీతం తోడిదే లోకంగా తల్లి బ్రతికేది. ఆ రాగాలతో పూలు పూయించే తోటమాలి తన తండ్రి. ఇది తన వంశ చరిత్ర. దాన్ని మరిచిపోయాడు. బయట ప్రపంచానికి మరో ముసుగు వేశాడు.

ఆలోచనల్లోంచి తెప్పరిల్లాడు. తల్లి గాఢ నిద్రలో ఉంది. పక్కింట్లో

అద్దెకుంటున్న వారికి చెప్పాడు. తాను పది నిమిషాల్లో వస్తానన్నాడు. బయట రోడ్డు మీద కొచ్చాడు. అప్పటికి గుర్తు వచ్చింది. సెల్‌ఫోన్ మరిచి వచ్చిన విషయం. ఫరవాలేదు అదే మంచిది అనుకుంటూ నడుస్తున్నాడు. తను పెరిగిన ఊరు. తల్లితో తిరిగిన నేల. ఎక్కడ చూసినా కొబ్బరి చెట్లు. ఊరి మధ్యకోనేరు. ఆ పక్కనే శివాలయం. ఎవరో రచయిత రాసినట్టు పూజా పీఠం లాంటి ఊరు.

గబగబా నడుస్తున్నాడు. పావు గంట సేపు అలా అన్యమనస్కంగా నడిచేడు. ఎదురుగా బోర్డు కనిపించింది. కస్తురిబా వృద్ధుల ఆశ్రమం. చుట్టూ ప్రహారీ గోడ. బయట పెద్ద గేటు. ఒక్కసారిగా మేఘాలు కమ్ముకున్నట్టు నలుగురైదుగురు ముసలివాళ్ళు అతడిని చుట్టుముట్టారు. అరవై, డెబ్బై సంవత్సరాలు దాటిన వృద్ధులు. ఆదిత్యను పరిశీలనగా చూసి 'ఈయనెవరో' అనుకుంటూ వెళ్ళి పోయారు. పాపం 'వాళ్ళకు తెలిసిన వాళ్ళనుకుంటున్నారేమో నన్ను చూసి' అనుకున్నాడు ఆదిత్య. ఆ ఆవరణలో అటూ ఇటూ తిరుగుతున్న ముసలి వాళ్ళు కొంతమంది చెట్టు కింద కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. నడుస్తున్న ఆదిత్య వంక చూసి ఒక ముసలాయన వచ్చి "సార్ నమస్కారం. వారం క్రితం టీవీలో మీ ఇంటర్వ్యూ చూసాను. ముసలి వాళ్ళ మతి మరుపు అంటే డిమెన్షియా (DIMENTIA) గురించి మాట్లాడారు కదా" అన్నాడు.

'ఔను!" అన్నాడు ఆదిత్య.

"ఇదివరకు లేదుసార్ ఈ జబ్బు. ఈ ఐదేళ్ళ నుంచీ కనిపిస్తోంది. చాలా మంది ముసలి వాళ్ళల్లో. దీనికి కారణం ఏమిటంటారు?" అన్నాడు ఆ వృద్ధుడు.

"అల్జీమర్స్‌కి ఇంకా ఖచ్చితమైన కారణం కనిపెట్టలేదు. చికిత్స అందుబాటులో లేదు. మెదడు కణాలు కుంచించుకుపోయి పరిమాణం తగ్గిపోవడం వల్ల ఈ వ్యాధి కలుగుతుందని ఒక పరిశోధన" అన్నాడు ఆదిత్య.

“ఇక్కడ ఈ వృద్ధుల ఆశ్రమంలో ఇలా మతి కోల్పోయిన వాళ్ళు నలుగురైదుగురున్నారు సార్. పాపం పేర్లు మరిచిపోతున్నారు. ఇంటిదారి గుర్తుండదు. అడిగిన ప్రశ్నే అడుగుతారు. అదే నయమేమో సార్. తల్లి వేళ్ళను మరిచిపోయిన పిల్ల వేళ్ళను గుర్తుంచుకునే బదులు....” అన్నాడు వృద్ధుడు నమస్కారం పెట్టి వెళ్ళిపోతూ.

ఆ మాటలు చెంపకు ఛెళ్ళున తగిలినట్లునిపించాయి ఆదిత్యకు. వేగంగా ఆ ఆశ్రమం నుంచి బైటపడి ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుకున్నాడు. ఇంటి ముందు కుర్చీలో కూర్చున్న తల్లి కనిపించింది. ఒక్కసారిగా పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టయింది.

“అమ్మా...” అన్నాడు ఆదిత్య ఒక్కసారి అతడిని పరిశీలనగా చూసి “ఎవరు బాబూ నువ్వు?” అంది తల్లి.

అతడి మనసులో బాధ సుళ్ళు తిరిగింది.

“తొమ్మిది నెలలు నీ కడుపున మోసావు. ముప్పయేళ్ళు పెంచావు. ఎవరు బాబూ నువ్వు అంటే నేనేం చెప్పను.” అన్నాడు దిగులుగా.

అతడి మాటలకు అయోమయంగా చూసి, తలతిప్పి ఎటో చూస్తోంది తల్లి. ఇంతలో అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్ మోగింది. లోపలకు వెళ్ళి సెల్ చూశాడు. చాలా మిస్సుడు కాల్స్. “ఇంకో గంటలో ట్రెయిన్‌కేచ్ చెయ్యాలి. మీ ఇంటికి కారు పంపిస్తున్నాం. డైరెక్టుగా స్టేషనుకు వచ్చేయండి” మైథిలి నుంచి ఫోను.

“అలాగే...” అంటూ అన్యమనస్కంగా చెప్పి మళ్ళీ తల్లి దగ్గరకు వచ్చి “అమ్మా...నా చిన్నప్పుడు ఇడ్లీలు అమ్మేవాళ్ళం కదా...నేనేమో ఇడ్లీ లబ్బాయిని..” అన్నాడు, ఆ జ్ఞాపకం గుర్తు చేస్తూ. ఆమె ముఖంలో ఏమీ మార్పులేదు.

“అమ్మా నేను డాక్టరు కోర్సు చేసాను కదా... పెద్ద ఉద్యోగం. డాక్టరు ఆదిత్య ఎమ్.డి. కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ మెల్‌బోర్న్ హెల్త్. అన్నాడు గబగబా.

ఆ మాటలకు ఆమె తలెత్తి “ఏంటో మాట్లాడుతున్నావ్ కూడా ఒక్క ముక్క అర్థం కావడం లేదు” అంది.

“ఏంటమ్మా అలా అంటున్నావ్!” అన్నాడు ఆదిత్య దాదాపు ఏడుస్తూ. క్షణం సేపు ఆలోచనలో పడ్డాడు. అటూ ఇటూ పచార్లు చేసాడు. ఏదో గుర్తుకొచ్చిన వాడిలా ఆమె ఎదురుగా గబగబా వచ్చి “ఆచార్యదేవా! ఏమంటివి? జాతి నెపమున సూత సుతునికి ఇందు అర్హతలేదందువా? ఎంతమాట? ఎంత మాట! ఇది క్షాత్ర పరీక్షయే గాని క్షత్రియ పరీక్ష గాదే!” ఇదే డైలాగ్ కదమ్మా..నువ్ నాకు నేర్పించావ్ దుర్యోధనుడి ఏకపాత్రాభి నయానికి...” అన్నాడు.

“ఏమిటో పిచ్చి వాగుడు?” అంటూ నవ్వేసింది తల్లి.

ఇంతలో ఫోన్ మోగింది. “మేం స్టేషనులో దిగి కారు పంపుతున్నాం. వెంటనే వచ్చేయండి” మళ్ళీ పిలుపు. ఏం చెయ్యాలి? మెల్‌బోర్న్‌లో ఉద్యోగం. ప్రేమించిన మనిషితో పెళ్ళి... డాలర్ల జీతం...పెళ్ళవగానే గ్రీన్‌కార్డుతో అక్కడే పౌరసత్వం....అవన్నీ వదులుకుని ఇక్కడుంటే. నా పై ఆశలు పెంచుకున్న అమ్మ.

మనసులో ఆలోచనల సుడి.

ఒక సందిగ్ధం.

ఒక సంకోచం.

ఒక వ్యాకులత.

ఆ గదిలో పచార్లు చేస్తూ అన్యమనస్కంగా తిరుగుతున్నాడు ఆదిత్య.

అంతలో ఎక్కడినుంచో మృదుమధురమైన సంగీతం. అలా గాల్లో తేలుతూ వచ్చింది. తల్లి దాన్నే హమ్ చేయడం గమనించాడు. ఔను...ఆవిడ ఒకప్పుడు చక్కగా పాడేది. వెంటనే చిన్నప్పుడు తను నేర్పిన పాట గుర్తొచ్చింది.

"పంట చేలగట్ల మీద నడవాలి!

ఊహలేమో రెక్కలొచ్చి ఎగరాలి.

ఆటలతో బ్రతుకంతా గడపాలి.

మా ఊరు ఒక్కసారి పోయి రావాలి.

చూసి రావాలి!" అసంకల్పితంగా అతని గొంతు పలికింది.

"అలా కాదు..." అంటూ అతని తల్లి రాగయుక్తంగా పాడింది.

అతడిలో ఆశ్చర్యం. ఆనందం...పాత జ్ఞాపకాల్లోకి వెళుతోంది ఆమె తల్లి. కళ్ళల్లోని కొత్త వెలుగును చూసాడు.

"నేను ఆశమ్మ కొడుకుని" అంటూ గట్టిగా ఏడ్చేశాడు ఆదిత్య.

ఆదిత్య హృదయంలో ఆనంద తరంగం నాట్యం చేస్తోంది.

ఇంతలో ఫోన్ మోగింది. బయట రోడ్డు మీద అతడి కోసం వచ్చిన కారులో హారన్ మోగింది.

ఫోన్ ఎత్తాలనిపించలేదు. కారు ఎక్కాలనిపించలేదు. మరోసారి మ్రోగుతున్న ఫోన్ ఎత్తాడు. "ఆశ...అనే సంస్థను ఏర్పాటు చేస్తాను. అమ్మ పేరు మీద అమ్మలాంటి వారికోసం ఆశ అంటే (AASA) అఫెక్షన్ అండ్ సెక్యూర్ హోమ్ ఫర్ అల్జీమర్స్ పేషెంట్" అని చెప్పడం ముగించి ఫోన్ పెట్టేశాడు ఆదిత్య.

ఆదిత్య ఎక్కకుండానే కారు కదిలిపోయింది.

తల్లి ఇంకా పాడుతూనే ఉంది.

"అమ్మానాన్నలను కలవాలి.

ప్రేమానురాగాలు పంచుకోవాలి

అమ్మచేతి వంటనే ఆరగించాలి.

అమ్మ ఒడిలోనే నిదురపోవాలి.

మైమరచిపోవాలి.

మా ఊరు ఒక్కసారి పోయి రావాలి" తల్లితో వరస కలిపాడు ఆదిత్య.

*(నవ్య వీక్లి 21-3-2012)*